క్లుప్తంగా

బీటీ రోడ్డు పనుల పరిశీలన



పనుల గురించి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగర పాలక పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సూచించారు. బుధవారం స్థానిక సంతోష్ నగర్‌లో కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించాలన్నారు. నాణ్యతను విస్మరిస్తే చర్యలు తప్పవన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాసాయి, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో ఉచిత వైద్య శిబిరం

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో బయోకెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఓమ్ని హాస్పిటల్ వైద్యులు ఇంద్రప్రకాష్‌రెడ్డి(కార్డియోలాజిస్ట్), శశిర(జనరల్ ఫిజీషియన్), అఖిల్‌రాణా(జనరల్ సర్జన్), సాహెబ్ పాల్గొని అధ్యాపకులకు, విద్యార్థులకు ఆరోగ్య రక్షణ, జాగ్రత్తలపై వివరించారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

కర్నూలు(రూరల్): ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని పరిరక్షించాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం కేకే భవనంలో నిర్వహించిన ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల వర్క్‌షాప్‌లో లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయని, చలానా రూపంలో వేల రూపాయలు ఫైన్లు వేసి వేధిస్తున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సంక్షేమానికి ఆటంకంగా ఉన్న జీఓ 21ను రద్దు చేసి, కార్మికుల సంక్షేమం కోసం రూ.50 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్, పొలాల్లో పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డాక్టర్ బ్రహ్మారెడ్డి సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్‌లో రైతులకు, కార్మికులకు, వ్యాపారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దుమ్ము, దూళీలో పనిచేసేటపుడు ముఖానికి మాస్క్ ధరించాలన్నారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బ్రహ్మారెడ్డి సూచించిన అంశాలను గుర్తుంచుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ బ్రహ్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ గోవిందు, అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజరు కేశవరెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పేదలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): టిడ్కో గృహాలను పేదలకు అప్పగించాలని సీపీఐ జిల్లా కాకర్యదర్శి వర్గ సభ్యుడు కె.జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను పేదలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాల్లో జగన్నాథగట్టులో నిర్మించిన సుమారు 8 వేల ఇళ్లను పేదలకు అప్పగించాలని, ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

కర్నూలు (న్యూటౌన్): నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ హరికృష్ణ అకాల మరణంతో ఆయన కూతురు సౌమ్యశ్రీ భవానికి ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చింది. కర్నూలు ఎంపీడీఓ కార్యాలయ సబార్డినేట్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంతో ఆమె బుధవారం విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ తెలిపారు.

☛ కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన సురేష్‌కు ఇటీవల ఛాతిలో ఏదో తెలియని ఇబ్బంది కనిపించింది. భయం, ఆందోళనతో కార్డియాలజిస్టుల చుట్టూ తిరిగాడు. డాక్టర్లందరి వద్దా రిపోర్టులు నార్మల్‌గా వచ్చినా ఆయనకు భయం తగ్గలేదు. ఏమి లేకపోతే తనకు ఎందుకు ఇలా అవుతుందని పదేపదే ప్రశ్నించుకుంటూ మదనపడుతున్నాడు. అతనికి మానసిక జబ్బు ఉందని స్నేహితులు సైక్రియాటిస్ట్ వద్దకు తీసుకెళ్లి మందులు వాడితే మూడు వారాల తర్వాత కుదుటపడ్డాడు.



☛ కర్నూలులోని వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులుకు తరుచూ కడుపులో మంటగా ఉందని మెడికల్‌షాపునకు వెళ్లి గ్యాస్ మాత్రలు కొని వాడుతూ ఉండేవాడు. ఎందుకైనా మంచిదని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును కలిసి ఎండోస్కోపి కూడా చేయించుకున్నాడు. రిపోర్టు నార్మల్‌గా ఉందని చెప్పి ఎలాంటి మందులు రాయకుండా సదరు డాక్టర్ పంపించి వేశాడు. కానీ తనకు కడుపులో మంట తగ్గలేదని మరో డాక్టర్ వద్దకు వెళ్లాడు. అక్కడా అతనికి అదే ఫలితం కనిపించింది. తీరా అతనికి మానసిక సమస్య కారణంగానే కడుపులో మంటగా అనిపిస్తోందని ఓ జనరల్ ఫిజీషియన్ నిర్ధారించి అతనికి చెప్పకుండా మందులు రాసి ఇవ్వడంతో నయమైంది.

నాకేదో అయ్యింది!

- ఆరోగ్యంపై అంతులేని అనుమానాలు
- ఏ చిన్న వ్యాధి లక్షణం కనిపించినా ఆందోళన
- అనుమానంతో డాక్టర్ల వద్దకు పరుగులు
- డాక్టర్లకే పలానా టెస్టు చేయాలని సూచన
- 20, 30 రకాల పరీక్షలు పూర్తయితే గాని శాంతించని వైనం
- ఇలాంటివి మానసిక వ్యాధి లక్షణాలంటున్న వైద్యులు



ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక జబ్బుల విభాగానికి వచ్చిన రోగులు

పెద్దాసుపత్రికి వచ్చిన వ్యాధిగ్రస్తుల సంఖ్య

సంవత్సరం	అవుట్ పేషెంట్లు	ఇన్‌పేషెంట్లు
2021	15,942	92
2022	19,475	175
2023 (ఇప్పటి వరకు)	9706	283

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలలోని మానసిక జబ్బుల విభాగానికి ప్రతిరోజూ 80 నుంచి 120 మంది వరకు చికిత్స కోసం వస్తుంటారు. అలాగే ప్రైవేట్ మానసిక వ్యాధి నిపుణుల వద్దకు సైతం ప్రతిరోజూ 300 నుంచి 400 మంది చికిత్స కోసం వస్తారు. వీరిలో 20 శాతం మంది తమకు ఏ జబ్బు లేకపోయినా ఏదో అయ్యిందని మదనపడుతూ వ్యాధి లక్షణాలను బట్టి స్పెషలిస్టుల వద్దకు తిరుగుతూ ఎక్కడా ఎలాంటి పరిష్కారం లభించక చివరకు మానసిక వైద్యుల వద్దకు వస్తున్నారు. ఏమి లేకపోతే తనకే ఎందుకు ఇలా జరుగుతోందని వైద్యులను ప్రశ్నిస్తుంటారు. ఇలాంటి వారికి నచ్చజెప్పి చికిత్స చేసేందుకు వైద్యులు చాలా కష్టపడుతుంటారు.

అతి అవగాహనతోనే..

వైద్యునిగా పూర్తిస్థాయి పట్టా తీసుకునేందుకు 12 నుంచి 15 ఏళ్ల సమయం పడుతుంది. కానీ కొంత మంది ఎలాంటి విద్యార్హత లేకుండా యూట్యూబ్‌లు, సోషల్ మీడియాలో ఆరోగ్యం గురించి సూచనలు, సలహాలు ఇస్తుంటారు. వైద్యుల మాట కంటే ఇలాంటి వారు చెప్పే మాటలు వినేవారు ఇటీవల అధికమయ్యారు. ఈ కారణంగానే తనకు ఎలాంటి జబ్బు లేకపోయినా ఏదో అయ్యిందని మానసికంగా బాధపడే వారి సంఖ్య అధికమైనట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

డాక్టర్ల చుట్టూ తిరగడమే పని

ఎక్కువగా పత్రికల్లో వచ్చే వ్యాసాలు, టీవీలు, యూట్యూబ్‌లో కనిపించే వీడియోల్లో ఆరోగ్యానికి సంబంధించిన కథనాలు చూసి ఆయా వ్యాధుల లక్షణాలను ఆపాదించుకుని తమకు కూడా ఆ వ్యాధి వస్తుందేమోనని, లేదా వచ్చిందేమోనని కొంత మంది భయపడుతుంటారు. దీనినే సోమాటా ఫామ్ డిజార్డర్ అంటారని వైద్యులు చెబుతున్నారు. ఊరికే డాక్టర్ల వద్దకు వెళ్లడం, పరీక్షలు చేయించుకోవడం చేస్తుండటాన్ని హైపోకాండ్రియాసిస్ అంటారు. ఇలాంటి వారికి ఏమీ లేకపోయినా మీకేదో సమస్య ఉందని చెబితేనే వారికి ఉపశమనం లభిస్తుంది. బాగున్నారని ఈ డాక్టర్ చెబితే ఇతనికి సరిగ్గా పరిజ్ఞానం లేదని సెకండ్ ఒపీనియన్ కోసం మరో డాక్టర్ వద్దకు వెళతారు. ఇలాంటి వారికి మందులు ఇచ్చినా వాడచ్చు..లేదా వాడకపోవచ్చు.

మహిళలల్లో అదో రకమైన సమస్య

తనను కుటుంబసభ్యులు, భర్త సరిగ్గా పట్టించుకోవడం లేదని, వారికి వచ్చిన ఒక సమస్య నుంచి బయటపడేందుకు కొందరు తరచూ ఏదో ఒక ఆరోగ్య సమస్య చెబుతూ ఉంటారు. వారు చెప్పే వ్యాధి లక్షణాల తాలూకు వైద్యపరీక్షలు చేయిస్తే ఎలాంటి సమస్య ఉండదు. కానీ తనకు ఛాతిలో, మెడ వద్ద, వెన్ను నొప్పి అని ఏదో ఒక ఆరోగ్య సమస్య మాత్రం చెబుతూ ఉంటారు. దీనిని సోమటైజేషన్ డిజార్డర్ అంటారు. ఇలాంటి వారు ఎప్పుడూ అనారోగ్యానికి గురైనట్లు ఉంటారు. వీరికి ఆరోగ్యం బాగైనా కూడా బాగున్నట్లు చెప్పరు. అలా చెబితే మళ్లీ తనను కుటుంబసభ్యులు సరిగ్గా పట్టించుకోరని వారి అనుమానం. ఇలాంటి వాటికి సైకో థెరపి, మందులు వాడాల్సి ఉంటుంది.

ఇలాంటి వారి సంఖ్య పెరిగింది



ఏమీ లేకపోయినా నాకేదో అయ్యిందని డాక్టర్ల చుట్టూ తిరిగే వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. టెస్ట్‌ల రిపోర్టులు నార్మల్‌గా ఉన్నా రోగిలో టెన్షన్ మాత్రం తగ్గదు. ఇలాంటివన్నీ సొమటైజేషన్ డిజార్డర్లు. వీటికి మేము యాంటిడిప్రెసెంట్, యాంటి యాంగ్జైటీ మందులు రాసిస్తాము. కానీ వారు సరిగ్గా వాడరు. కుటుంబ సభ్యులే ఒప్పించి సక్రమంగా మందులు వాడాలా చూడాలి.

– డాక్టర్ గంగాధర్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మానసిక జబ్బుల విభాగం, పెద్దాస్పత్రి

పోస్ట్ కోవిడ్ తర్వాత ఎక్కువయ్యాయి



కోవిడ్ తర్వాత అభద్రతగా భావించి ఆరోగ్యం గురించి భయపడే వారు ఎక్కువయ్యారు. ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనే గుండెపోటుతో మరణిస్తున్న వారిని చూసి మరీ భయం ఎక్కువైంది. రాత్రిపూట ఎక్కువగా మొబైల్ చూడటం, గేమ్స్ ఆడటం వల్ల మానసిక జబ్బులు పెరిగాయి. అయితే వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్ధారణ చేసుకోవడం మంచిదే కానీ రిపోర్టులు నార్మల్‌గా ఉంటే సాధారణ జీవితంలోకి వెళ్లిపోవాలి.

– మీనిగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, పెద్దాస్పత్రి

నేడు విద్యా సదస్సు

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'విద్యార్థి యువత ఉన్నత లక్ష్యాల సాధన' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు, ఎస్పీ కృష్ణకాంత్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ గురుకులం ఫర్ ఐఏఎస్ ఫౌండర్ ఆకెళ్ల రాఘవేంద్ర ముఖ్య వక్తగా హాజరై వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైమరీ పాఠశాల విలీనాన్ని ఆపాలి

కర్నూలు సిటీ: మామిదాలపాడు ప్రాథమిక పాఠశాల విలీనాన్ని విరమించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు అమర్, నరసింహా, యోగి, తదితరులు బుధవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల పేద విద్యార్థులను స్టాంటన్‌పురం హైస్కూల్‌లో విలీనం చేయడంతో రోడ్డు, కేసీ కాలువ దాటి అంతదూరం వెళ్లలేక పలువురు విద్యార్థులు చదువులు మానేస్తున్నారని వివరించారు.

నూతన కార్యవర్గం



ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు కల్చరల్: రోటరీ క్లబ్ అనుబంధ సంస్థ ఇన్నర్ వీల్ క్లబ్ 2023–24 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార బుధవారం ఏక్యాంప్‌లోని పూర్వపు అధ్యక్షురాలు శారదా దేవి కార్యాలయంలో నిర్వహించారు. నూతన ప్రెసిడెంట్‌గా జీకే దేవి, కార్యదర్శిగా టి.శాలిని, కోశాధికారిగా టి.ఇందిర, ఐఎస్ఓగా కె.సుబ్బలక్ష్మిలచే పాస్ట్ ఇన్నర్ వీల్ 316 చైర్మన్ రాజా సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురికి నిత్యావసర సరుకులను అందజేశారు.

ప్రతి గడపకూ లబ్ధి చేకూరింది



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కల్లూరు అర్బన్ 29వ వార్డు, సాయంత్రం రెమడూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీవాసులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరగా.. స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు, మతాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయ శారద, సర్పంచ్ ప్రియాంక, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, నాయకులు నారాయణరెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల తీరు మారకపోతే చర్యలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాల్లో పనిచేసే డ్యూటీ డాక్టర్లు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన అనస్తీషియా, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ, క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అక్కడ అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీలు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనస్తీషియా, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీలు ఏఎంసీ, క్యాజువాలిటీలలో డ్యూటీ డాక్టర్ల రోస్టర్‌ను తమకు పంపాలన్నారు. ఈ మేరకు వైద్యుల విధి నిర్వహణపై పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఎం వార్డు పర్యటనలు

కర్నూలు(రూరల్): సీపీఎం ఆధ్వర్యంలో వార్డు పర్యటనలు కొనసాగుతున్నాయి. బుధవారం పార్టీ నగర కార్యదర్శి టి.రాముడు ఆధ్వర్యంలో 37వ వార్డు, కార్యవర్గ సభ్యురాలు జయమ్మ ఆధ్వర్యంలో 10వ వార్డు, కమిటీ సభ్యుడు కృష్ణ ఆధ్వర్యంలో 15వ వార్డులలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు స్థానికులకు చెప్పారు.

24 గంటల్లోనే సర్టిఫికెట్ మంజూరు



శివయ్యనగర్‌కు చెందిన షాహీదా తన కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. కుల, ఆదాయ, స్థానికత(ఇంటిగ్రేటెడ్) ధ్రువీకరణపత్రం అవసరమవడంతో ఇంటికి వచ్చిన సచివాలయ సిబ్బందికి వివరాలు ఇచ్చారు. బుధవారం నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమంలో ఎంపీ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంది. 24 గంటల్లోనే ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ చేతికందడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది.

ఇంటి వద్దకే సర్టిఫికెట్లు



శివయ్య నగర్‌కు చెందిన ఎరుకలి శివుడు తన కూతురికి కుల ధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో మంగళవారం సచివాలయ సిబ్బంది వద్ద దరఖాస్తు చేసుకున్నాడు.బుధవారమే సర్టిఫికెట్ మంజూరు చేసి ఎంపీతో లబ్ధిదారుడికి అందజేశారు. ఒక్కరోజులోనే సర్టిఫికెట్ అందడంతో అతడు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండలం కార్యాలయానికి వెళ్లి డబ్బు ఖర్చు పెట్టుకుని రోజుల తరబడి ఎదురు చూస్తే కానీ మంజూరు కానిది సులువుగా, పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్ అందిందని ఆయన ఆనందం వ్యక్తం చేశాడు.

నాయకుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి

- పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

కర్నూలు (టౌన్): చేతులు కట్టుకొని నాయకుల చుట్టూ తిరిగే రోజులు పోయాయని, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పేదల సంక్షేమం గురించి ఆలోచించే ఇలాంటి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. బుధవారం నగరపాలక పరిధిలోని 42వ వార్డు 109 సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షా కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. 120 మందికి వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన తాను చదువుకునే రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రం కోసం కళాశాలకు సెలవు పెట్టి తిరిగే వాడినన్నారు. ఈ ప్రభుత్వంలో ఇంటికే సచివాలయ సిబ్బంది వచ్చి దరఖాస్తు పూర్తి చేసుకుని ఒక్కరోజు వ్యవధిలోనే సర్టిఫికెట్ ఇస్తుండటం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, కేధార్‌నాథ్, వార్డు ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి, నగరపాలక స్పెషల్ ఆఫీసర్ సాధిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హులై ఉండి పథకాలు రాని వారిని గుర్తించి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారని దీంతో అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు 45వ వార్డు సచివాలయం ఇందిరమ్మ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అప్లై చేసుకున్న వారికి పైసా ఖర్చులేకుండా ఉచితంగా ధ్రువీకరణ పత్రా లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ను 98 శాతం అమలు చేయడంతో పాటు అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జేసీ ఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన





మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, సమావేశంలో పాల్గొన్న సీడీపీఓలు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతుల కల్పనపై సీడీపీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 360 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, 151 కేంద్రాల్లో నీటి కుళాయిలు, 306 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మరో 81 కేంద్రాల్లో నాడు-నేడు కింద పనులను చేపట్టామని వివరించారు. టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేస్తున్నామని, వంట పాత్రలు, ఇతర సామగ్రి, చిన్నారుల బరువు చూసే పరికరాలను కొనుగోలు చేసి పంపుతామన్నారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలు సాధించాలి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో రోజువారీ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో హౌసింగ్, ఉపాధి హామీ పథకం అమలు, ప్రాధాన్యత భవనాల పురోగతిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె.. ఇళ్ల నిర్మాణాల పురోగతి లేని గోనెగండ్ల, హాలహర్వి, కర్నూలు, ఆదోని, చిప్పగిరి, కోడుమూరు మండలాల ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పురోగతిలో వెనుకబడటానికి గల కారణాలను గోనెగండ్ల, నందవరం, ఆదోని రూరల్, సి.బెళగల్ మండలాల ఇంజినీర్లను ప్రశ్నించారు. హొళగుంద, వెల్దుర్తి మండలాల్లోనూ పురోగతి చాలా తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మార్చుకుని పురోగతి సాధించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వలంటీర్ల యాప్‌లో నమోదు చేసే బాధ్యత ఎంఈఓలదేనని, ప్రతి ఒక్కరినీ పాఠశాలలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించి బ్లూఫ్రాగ్ యాప్‌లో ఫిట్టింగ్ అప్‌డేషన్ చేయడంలో తుగ్గలి, కల్లూరు, వెల్దుర్తి మండలాలు వెనుకబడి ఉన్నాయని, రెండు రోజుల్లో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను వారంలోపు పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు నగరంలోని ముఖ్య కూడళ్లలో డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్‌రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో పోలీసులు తిష్ట వేసి వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడింగ్ చేస్తున్న 15 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని, వారి వాహనాలను సీజ్ చేసి కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని, మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలను ఉదహరిస్తూ ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం వారికి అవగాహన కల్పించారు.

వీధి బాలలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: వీధి బాలలను బడిలో చేర్పించాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా బడిబయటి పిల్లలను గుర్తించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు 700 మంది బడిఈడు పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ సునంద తెలిపారు. వారందరినీ ఈ నెల 15వ తేదీ లోగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అలాగే మనబడి నాడు-నేడు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓలు సునంద, ఓంకార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం సోమయాజులపల్లె వద్ద జరుగుతున్న ఫీడర్ ఛానల్‌లో పూడికతీత పనులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోజుకు రూ.272 వేతనం వచ్చేలా పనిచేయాలన్నారు. అనంతరం హుసేనాపురం వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.